క్లుప్తంగా

నేడు వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలో 18వ దశలో 173 మంది వలంటీర్ల అభ్యర్థుల ఎంపిక ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలు పటమటలోని సర్కిల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ చాంబర్‌లో జరుగుతాయని, ఆయా వార్డులకు సంబంధించిన అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రంలో మౌఖిక పరీక్షకు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని వివరించారు. వివరాలకు స్పెషల్ ఆఫీసర్ (వార్డ్ సెక్రటేరియట్స్) వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్, వీఎంసీ 8185933187 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహనీయులను స్మరించుకోవాలి



విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినిచ్చిన మహనీయులను స్మరించుకోవాలని సినీ నటుడు త్రిపురనేని గోపీచంద్ అన్నారు. భాషా సాంస్కృతిక వైభవంలో భాగంగా సోమవారం నగరంలోని విక్టోరియా మ్యూజియంలో పింగళి వెంకయ్య విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాల్సిన అవసరముందన్నారు. భాషతోనే జాతి మనుగడ సాగుతుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త గోళ్ల నారాయణరావు, వెంకటేశ్వరరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

నేత్రపర్వం వెంకన్నకు గరుడ సేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పౌర్ణమి పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని సోమవారం రాత్రి నేత్రపర్వంగా చేశారు. పాతబస్తీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాస పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించటం ఆనవాయితీ. స్వామి వారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ పొన్నంగిపల్లి దీక్షిత్ నిర్వహించగా ఆలయ ఈఓ గెల్లి హరిగోపీనాథ్‌బాబు పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం అందజేత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలోని పలు పేద వర్గాలకు వెలంపల్లి ఫౌండేషన్ సోమవారం సాయమందించింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సాయిఅశ్విత నియోజకవర్గంలో పలువురికి ఆర్థిక సాయం అందించారు. 46వ డివిజన్‌కు చెందిన రాముకు జ్యూస్ స్టాల్‌ను అందించారు. 44వ డివిజన్‌లోని శివనాగేంద్రస్వామి దేవస్థాన నిర్మాణానికి రూ.25 వేల విరాళం అందించారు. 55వ డివిజన్‌కు చెందిన కనక రమేష్‌కు మందుల నిమిత్తం రూ.15వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వెలంపల్లి రాఘవ నరసింహారావు, కొనకళ్ల విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

'బిక్కవోలు' సేవలు అభినందనీయం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ రాజమండ్రి సెక్షన్‌లోని బలభద్రపురం రైల్వే స్టేషన్‌లో 47 ఏళ్ల పాటు హాల్ట్ టికెటింగ్ ఏజెంట్‌గా నిరంతరాయం సేవలు అందించిన 87 ఏళ్ల బిక్కవోలు సత్యనారాయణచార్యులను కమర్షియల్ విభాగం అధికారులు ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ మేరకు సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో బిక్కవోలు సత్యనారాయణ చార్యులను సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. సీనియర్ డీసీఎం మాట్లాడుతూ 1958 నుంచి 2005 వరకు బలభద్రపురం స్టేషన్‌లో హాల్ట్ టిక్కెటింగ్ ఏజెంట్‌గా ఫిర్యాదులు లేకుండా అంకితభావంతో రైల్వేకు సేవలు అందించడంపై ఆయన్ను ప్రశంసించారు. కార్యక్రమంలో డీసీఎంలు ఎండీ ఆలీఖాన్, సి.ప్రదీప్, ఏసీఎం వి.రవివర్మ తదితరులు మాట్లాడారు.

శాకంబరీ చిన్మయిూ..

- ముగిసిన శాకంబరీ ఉత్సవాలు
- కళకళలాడిన వన్‌టౌన్‌లో ఆలయాలు

వన్‌టౌన్(విజయవాడ): శాకంబరీ చిన్మయిూ అంటూ అమ్మవారిని భక్తజనం మనసారా ప్రార్థించారు. పాతబస్తీలోని వివిధ ఆలయాల్లో శాకంబరీ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. శాకంబరీదేవి అలంకారాల్లో ఆయా ఆలయాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. సోమవారం పూర్ణాహుతితో ఉత్సవాలను ముగించారు.

పాతబస్తీలోని పురాతన ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవం ముగింపు సందర్భంగా చండీ హోమం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పూర్ణాహుతిలో పాల్గొన్నారు. స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను ఈఓ నాగరాజు పర్యవేక్షించారు. ఆలయ కమిటీ మాజీ సభ్యుడు పణుకు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో ఎమ్మెల్యే వెలంపల్లి

- వన్‌టౌన్ కేటీరోడ్డులో గంగానమ్మ ఆలయంలో, కొత్తపేట శ్రీనివాసమహల్ సెంటర్ సమీపంలోని శ్రీ గంగానమ్మసన్నిధిలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి ముగించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.
- బ్రాహ్మణవీధిలోని శ్రీ చదును మహాలక్ష్మి దేవస్థానంలో శ్రీ శాకంబరీదేవి ఉత్సవాన్ని నిర్వహించారు. అష్టలక్ష్ములను ప్రత్యేకంగా అలంకరించారు.
- శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం(కొత్తగుళ్లు)లో శాకంబరీదేవి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో మూడో రోజు అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కాయలు, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించగా, ఆలయ అర్చకులు అమరలింగేశ్వర కృష్ణ ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ శర్మలు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

దేవస్థాన అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులు అవసరమైన సదుపాయాలను కల్పించారు.


- పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ గంగానమ్మ దేవస్థానంలో ఉత్సవాల్లో చివరి రోజైన సోమవారం అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక, యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు.



పాతశివాలయంలో శాకంబరిగా భ్రమరాంబ



పాతశివాలయంలో ప్రత్యేక పూజలు



గంగానమ్మ ఆలయంలో..



మహాలక్ష్మికి పండ్లతో అలంకరణ

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వన్‌టౌన్‌లోని సాయిబాబా మందిరాలు భక్తులతో పోటెత్తాయి. పంచామృతాలు, వివిధ పళ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు ఉదయం నుంచి భక్తులు అఖండ సాయి నామ సంకీర్తనలు చేశారు. సాయి మందిరాలను పూలతో అలంకరించారు. మందిరాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. కొత్తపేట గణపతిరావురోడ్డులోని శ్రీ పండరి సాయి మందిరంలో స్వామి వారికి ఉదయం నుంచి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాండురంగ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ పూజలు నిర్వహించారు.

- నెహ్రూబొమ్మ సెంటర్‌లోని సాయి మందిరంలో బాబాకు ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయంలో సాయంత్రం ప్రత్యేక దీపాలంకరణ చేశారు.
- పాతశివాలయం ప్రాంగణంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి సన్నిధిలో సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సోమవారం గురు పూజా మహోత్సవం నిర్వహించారు. దేవస్థాన వేద పండితులు గుంటూరి శ్రీరామ చంద్ర సోమయాజులు దంపతులకు దేవస్థాన వైదిక కమిటీ, సిబ్బంది గురు పూజ, గురు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన ఆశీర్వచన మండపంలో జరిగిన కార్యక్రమానికి దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ గురు పండితులను శాలువాలు కప్పి సత్కరించి పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు నంబూరి రవి, దేవిశెట్టి బాలకృష్ణ, చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



నెహ్రూబొమ్మ సెంటర్‌లోని బాబా మందిరంలో సాయినాథుడికి అలంకరణ



పాతశివాలయంలో దత్తాత్రేయుడికి పూజలు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): పెజ్జోనిపేటలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ షిర్డీ సాయినాథుని మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కృష్ణాప్రసాద్ ఆధ్వర్యాన ద్వారకామాయి మందిరంలో దత్తహోమం చేశారు. సాయినాథుడికి అభిషేకాలు జరిగాయి. పూజ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు శంకరరావు, రామారావు, జయలక్ష్మి, చక్రవర్తి, మాధవరావు, హరినాథ్ పర్యవేక్షించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక పాత హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్పసిద్ధి శ్రీషిర్డీ సాయి బాబా మందిరంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణమి ద్వాదశ సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఉదయం 6గంటలకు బాబా విగ్రహాన్ని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం హెచ్‌బీకాలనీ, హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ పుర వీధుల్లో సాయినాధుని ఊరేగింపు జరిగింది. మందిరం పాలకమండలి అధ్యక్షులు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, ఇన్నమూరి వెంకట రమేష్, కోశాధికారి చందలూరి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గురు పండితులను సత్కరిస్తున్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

- భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని శ్రీదాసాంజనేయ సహిత షిర్డీ సాయిబాబా, ఉమా రామలింగేశ్వర స్వామి మందిరంలో నిర్వహిస్తున్న గురు పౌర్ణమి మహోత్సవంలో భాగంగా సోమవారం కృష్ణానదీ తీరాన సాయిబాబాకు చక్రస్నానం చేయించారు. అనంతరం 54వేల రుద్రాక్షలతో బాబాకు విశేష అలంకరణ, పూర్ణాహుతి చేశారు. పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. మందిర అర్చకులు గురుజాడ బాలచంద్రశేఖర శర్మ నేతృత్వంలో నిర్వహించిన పూజల్లో మందిర ధర్మకర్త పాములపాటి దుర్గా ప్రసాద్–మధుబాల, స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి, మల్లెల శ్రీనివాసరెడ్డి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో హజ్ యాత్రికులకు వసతులు

వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గత ప్రభుత్వాలు చేయనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హజ్ యాత్రికులకు వసతులు అందజేస్తున్నారని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. భవానీపురంలోని పోలీసు కాలనీలో సోమవారం నూరి మసీదులో హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం మైనార్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మసీదులో జుహార్ నమాజును ఆచరించారు. అనంతరం మసీదు ప్రాంగణంలో స్థానిక ముస్లిం పెద్దలతో, మసీదు బాధ్యులతో సమావేశం నిర్వహించారు. గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ హజ్ యాత్రికుల విషయంలోనే కాకుండా మైనారిటీలకు ప్రతి విషయంలోనూ వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్దమనసుతో ముందుకెళ్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రతి ముస్లిం అండగా నిలబడాలని కోరారు. మైనారిటీ సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది హజ్ యాత్రలో కల్పించిన సౌకర్యాలను పలువురు పెద్దలు తనతో పంచుకున్నారని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, ఎండీ ఇక్బాల్, ముతవల్లి ఎండీ యాకూబ్ అలీషా నూరి, సెక్రటరీ అబ్దుల్ ఆదిల్, ఎండీ మజహర్ ఆలీషా తదితరులు పాల్గొన్నారు.



హర్ దిల్ మే వైఎస్సార్‌లో భాగంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌస్ మొహిద్దీన్



మసీదు వద్ద కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మొహమూద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో పేద ముస్లిం మైనార్టీ కుటుంబాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆదుకుంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ మొహమూద్ అన్నారు. ఆయన 44వ డివిజన్ పరిధిలోని విద్యాధరపురం లేబర్‌కాలనీలో మదీనా మసీదు వద్ద 'హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్ కె సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం అసర్ నమాజును ఆచరించిన అనంతరం మొహమూద్ మసీదు ప్రాంగణంలో స్థానిక ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, మైనార్టీ నాయకులు అలీ, మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ సత్తార్, వైస్ ప్రెసిడెంట్ కరీం, సెక్రటరీ ముజిబ్ బేగ్, ఇమామ్ గౌస్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

తల్లీకుమారులపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కూరగాయలు బాగోలేదని తల్లి, కొడుకులపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్‌లో పీలా నాగేశ్వరరావు కూరగాయల వ్యాపారి. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సూర్యప్రకాష్, రోహిత్, మణికంఠలు కూరగాయల కోసం వచ్చి వారితో గొడవ పడ్డారు. కొంత సమయం తర్వాత నాగేశ్వరరావు బయటకు వెళ్లగా షాపులో అతని తల్లి కూర్చుంది. దీంతో ఆ ముగ్గురూ నాగేశ్వరరావు తల్లిపై దాడి చేస్తున్నారు. ఆసమయంలో అతను రావడంతో అతనిపై కూడా దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మౌలానా నగర్‌కు చెందిన 16 ఏళ్ల బాలిక ఈనెల ఒకటో తేదీన ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. ఇంట్లో తల్లిదండ్రులు ఎవరూలేని సమయంలో ఆమెకు మామయ్య వరుసయ్యే కోటేశ్వరరావు బాలిక ఇంటికి వెళ్లాడు. ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని బైక్ ఢీకొట్టడంతో గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గణపతిరావు రోడ్డులో నివసిస్తున్న ఆనంద్ ఇంటి వద్ద నుంచి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా, చిట్టినగర్ వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఆనంద్‌కు తీవ్రగాయాలు కాగా నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

సంతృప్తికరంగా పరిష్కారాలను అందించండి



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు సంతృప్తికరంగా పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. వీఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 7 ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణ ప్రణాళిక విభాగం–2, ఇంజినీరింగ్ విభాగం–5 వినతులు అందాయి. జగనన్నకు చెబుదాం 1902, స్పందన, అవర్ వీఎంసీ పోర్టల్‌లను నగరపాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించుకోవాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో స్పందన్ అర్జీలు– 1

సర్కిల్ కార్యాలయాలలో జోనల్ కమిషనర్లు స్పందన కార్యక్రమము నిర్వహించగా చిట్టినగర్‌లోని సర్కిల్ –1 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి – 1 అర్జీ, సత్యనారాయణపురంలోని సర్కిల్ – 2, పటమటలోని సర్కిల్ –3లో అర్జీలు రాలేదని జోనల్ కమిషనర్లు తెలిపారు.

నట యశస్వి ఎస్వీ రంగారావు

విజయవాడ కల్చరల్: నట యశస్వి సినీ నటుడు ఎస్వీ రంగారావు అని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, సి.రామ్మోహనరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన సోమవారం తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఎస్వీ రంగారావు 105 జయంతి వేడుకలను నిర్వహించారు. అడపా శేషు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే మహోన్నత నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఎస్వీఆర్ నటించిన నర్తనశాల తొలి సారిగా విదేశాల్లో ప్రదర్శించినట్లు గుర్తు చేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు చినుకు హరగోపాల్, బడేటి ధర్మారావు, ఉప్పురంగ ప్రసాద్, పెన్నారు దామోదరం, ఇ.వాసు, మాంతి రమణ ఎస్వీఆర్ నట సేవలను వివరించారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిండైన విగ్రహం..మెండైన నట విశ్వరూపంతో కథానాయకులకంటే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ పేరు సంపాదించిన సామర్లకోట వెంకట రంగారావు (ఎస్వీఆర్) నటనా వైదుష్యం చిరస్మరణీయమని పలువురు కాపు సంఘ నాయకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డ్ అందుకున్న తొలి తెలుగు నటుడు ఎస్వీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఎస్వీఆర్ జయంతి సందర్భంగా ఎస్వీరంగారావు కాపు, తెలగ, బలిజ, ఒంటరి ఐక్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం విద్యాధరపురం వంగవీటి మోహనరంగా జంక్షన్‌లోని సంస్థ కార్యాలయంలో ఎస్వీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కేక్ కోసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు మైలవరపు దుర్గారావు, పత్తి నాగేశ్వరరావు, అధ్యక్షులు పదిలం రాజశేఖర్, ఉపాధ్యక్షులు ఉదయభాస్కర్, కోశాధికారి జవ్వాజి వెంకట్రావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీరంగారావు జయంతిలో అడపా శేషు, నృసింహం, ఉప్పురంగ ప్రసాద్, వాసు తదితరులు



కాపు సంఘ కార్యాలయంలో కేక్ కోస్తున్న సంఘ నాయకులు

అలరించిన ఆంధ్ర నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): 'ధర్మపథం'లో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు కళాకారులు ఆంధ్ర నాట్య ప్రదర్శన ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ నటరాజ నృత్యాలయానికి చెందిన నాట్యాచార్య రాయన శ్రీనివాసరావు బృందం ఆంధ్ర నృత్య ప్రదర్శన చేసింది. నృత్యాలయానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేశారు. అనంతరం వారు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులతో సోమవారం నిర్వహించిన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా సాగింది. ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ మూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ, పెనుగ్రంచిప్రోలు ఆలయ చైర్మన్ చెన్న కేశవరావు, ఈఓ కె.రమేష్ నాయుడు పూజా కార్యక్రమాలు నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ వేద మంత్రోచ్చరణలతో ఆది దంపతులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువు తీరారు.



శోభాయమానంగా సాగుతున్న దుర్గామల్లేశ్వర స్వామివార్ల గిరిప్రదక్షిణ

జై భవానీ.. జైజై భవానీ అన్న భక్తుల నామస్మరణ మధ్య ఊరేగింపు ముందుకు సాగింది. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాలు, విద్యాధరపురం, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కలరా హాస్పిటల్, చిట్టినగర్, కేటీ రోడ్డు, బ్రాహ్మణ వీధి మీదుగా గిరి ప్రదక్షిణ కొనసాగింది. గిరి ప్రదక్షిణలో తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన ఆదిదంపతులకు భక్తులు హారతులిచ్చి పూజలు చేశారు. పౌర్ణమి నాడు నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణలో పాల్గొనడం ద్వారా భక్తుల కోర్కెలు తీరడంతో పాటు వారి ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ఆలయ పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు, ఈఈలు కె.వి.ఎస్.కోటేశ్వరరావు, ఎల్.రమా తదితరులు పాల్గొన్నారు.

- **పెనమలూరు:** మండలంలోని పోరంకి గ్రామం విష్ణుపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆగమ పండితుడు హరినవీన్, శిష్య బృందం శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. తొలుత సుప్రభాతసేవ, తోమాలసేవ, తులసీ దళాలతో సహస్రనామార్చన, హోమం, పలు పూజా కార్యక్రమాలు చేశారు.